
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి 3 మెదక్
గురువారం 3 అక్టోబరు 2024
జిల్లాల వార్తలు



## ప్రతీ కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ కార్డు

- నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం.. 11 బృందాలు ఏర్పాటు
- మెదక్ అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు

5






## గాంధీజికి ఘన నివాళి

మహాత్మ గాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం సంగారెడ్డి జడ్పీ ఆవరణలోని గాంధీ విగ్రహానికి ప్రముఖులు నివాళులర్పించారు. జడ్పీ ప్రత్యేకాధికారిణి, కలెక్టర్ క్రాంతి, జడ్పీ సీఈవో జానకిరెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, నేతలు పూలమాలలు వేసి గాంధీజీ అహింస, శాంతి మార్గాన్ని నెమరువేసుకున్నారు.

– సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 2




## మహాత్ముడికి టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డి నివాళి



సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 2 : గాంధీ జయంతిని పురస్కరించుకొని సంగారెడ్డిలోని గంజిమైదాన్‌లో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గాంధీజీ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ ఆంజనేయులు, పట్టణ అధ్యక్షుడు జార్జ్, కౌన్సిలర్లు సంతోశ్, వెంకటరాజు, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలాజగ్గారెడ్డి, నివాళులర్పించిన టీజీఐఐసీ చైర్‌పర్సన్, తదితరులు





తూప్రాన్ పట్టణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

## ఒక్కేసి పువ్వేసి చందమామ



సంగారెడ్డిలో నిమజ్జనం చేస్తున్న బతుకమ్మలు

బతుకమ్మ మహోత్సవం ప్రారంభమైంది. తొలిరోజైన బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలను సంబరంగా నిర్వహించారు. ఉయ్యాల పాటలు పాడుతూ ఆడపడుచులు బతుకమ్మ చుట్టూ తిరిగారు. అనంతరం సమీపంలోని చెరువులు, బతుకమ్మ ఘాట్‌లలో నిమజ్జనం చేశారు. పసుపు, కుంకమ్మ వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు.

– సంగారెడ్డి / మెదక్




# ఇక్కడి వారికి ఆశల్లేవా..!

- మొదలైన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి
- ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం
- ఆశావహులంతా కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల వారే
- పోటీకి ఉమ్మడి మెదక్ జిల్లాలో కానరాని అభ్యర్థులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, అక్టోబరు 2 : ఉత్తర తెలంగాణ జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్నది. రాష్ట్రంలో పెద్దలసభగా భావించే శాసనమండలికి ప్రతీ ఆరేళ్లకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయి. కరీంనగర్ - మెదక్ - ఆదిలాబాద్ - నిజామాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న టి.జీవన్‌రెడ్డి పదవీకాలం 2025 మార్చి 29తో ముగియనున్నది. అప్పటిలోగా ఎన్నిక నిర్వహించి కొత్త ఎమ్మెల్సీని ఎన్నుకోనున్నారు. ఇప్పటినుంచే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు కసరత్తు మొదలైంది. ఓటర్ల నమోదు ప్రక్రియకు సెప్టెంబరు 30వ తేదీ నుంచే శ్రీకారం చుట్టారు. నవంబరు 6వ తేదీదాకా గడువు ఉంది.. అయితే, పట్టభద్రుల స్థానం నుంచి పోటీ చేసేందుకు ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి ఆశావహులెవరూ ముందుకు రాకపోవడం గమనార్హం.

### ఆ రెండు జిల్లాల నుంచే ఆశావహులు

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభం కాకముందే ఆశావహుల ప్రచారం కూడా మొదలుపెట్టారు. ఐఎంఏ మాజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎన్ రావు సామాజిక కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నారు. ఎమ్మెల్సీగా గెలిపించాలని అన్ని వర్గాలను కోరుతున్నారు. ఇక అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి సైతం తనదైన శైలిలో ప్రచారం చేపడుతున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని జనసంచార ప్రాంతాల్లో ఆయన ఫ్లెక్సీలు వెలిశాయి. ఇటీవల కరీంనగర్ ఎంపీగా పోటీచేసి ఓటమిపాలైన కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్‌రావు సైతం ఆ పార్టీ తరఫున బరిలోకి దిగుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఆ దిశగా కసరత్తు కూడా ప్రారంభించారు. ఇక కరీంనగర్ మాజీ మేయర్, బీఆర్‌ఎస్ నేత సర్దార్ రవీందర్‌సింగ్ పేరు ఎమ్మెల్సీ రేసులో వినిపిస్తోంది. విన్నర్స్ పబ్లికేషన్ ఛైర్మన్, లెక్చరర్ల సంఘం నేత ప్రసన్న హరికృష్ణ సైతం ఉద్యోగానికి రాజీనామా చేసి బరిలో నిలవనున్నారు. రెండు దశాబ్దాలుగా నిరుద్యోగులు, ఉద్యోగ సంఘాలతో సన్నిహిత సంబంధాలతోపాటు ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో పనిచేసిన అనుభవం తనకు కలిసివస్తుందని భావిస్తున్నారు. వీరందరిది కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లా నేపథ్యమే కావడం విశేషం. ప్రైవేట్ పాఠశాలల యజమానుల సంఘం (ట్రస్మా) రాష్ట్ర నాయకుడు యాదగిరి శేఖర్‌రావు కూడా ఎమ్మెల్సీ రేసులో ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లా జన్నారం మండలానికి చెందిన ఈయన ప్రైవేట్ పాఠశాలల యజమానులు, టీచర్ల హక్కుల నేపథ్యంలో తెరమీదకు వచ్చారు. కరీంనగర్‌లో స్థిరపడిన ఈయన ప్రైవేట్ టీచర్లను ఏకతాటి మీదకు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు.

### సోషల్‌మీడియాలో హల్‌చల్

2019 ఎన్నికలతో పోల్చితే ప్రస్తుతం సోషల్‌మీడియా అధిక ప్రాచుర్యాన్ని పొందింది. ఈ క్రమంలో ఆశావహులంతా సోషల్‌మీడియా కేంద్రంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. వారివారి పేర్లతో ప్రత్యేకంగా వాట్సాప్ కమ్యూనిటీ గ్రూప్‌లు ఏర్పాటు చేసి తమగురించి చెప్పుకుంటున్నారు. ప్రత్యేకంగా పీఆర్‌వోలను నియమించుకున్నారు. టార్గెట్ ఫర్ ఎమ్మెల్సీ, గోల్ ఫర్ ఎమ్మెల్సీ అంటూ సోషల్ మీడియాలో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఈ ప్రచారం ఎక్కువైంది. తాము చేస్తున్న సేవా కార్యక్రమాలు, తమ ఎజెండా, తమ విధివిధానాలను పట్టభద్రులకు అర్థమయ్యేలా చేరవేస్తున్నారు. గ్రాడ్యుయేట్లు ఓటు నమోదు చేసుకోవాలని స్వయంగా ఆశావహులే ఫారం-18ను అందజేస్తున్నారు.



### పోటీకి మెదక్ నేతల నిరాసక్తత

ఓవైపు పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం ఆశావహులు తమ ప్రయత్నాల్లో నిమగ్నమవగా, ఇదే స్థానం పరిధిలో ఉన్న ఉమ్మడి మెదక్ జిల్లాలో నైరాశ్యం నెలకొన్నది. ఆయా పార్టీల నేతలతోపాటు ఆశావహులు కూడా నిరాసక్తత కనబరుస్తున్నారు. ఒక్కరంటే ఒక్కరు కూడా తాము రేసులో ఉన్నామని ప్రకటన చేయకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. 2006లో పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఎన్నికైన ఆర్.సత్యనారాయణది ఉమ్మడి మెదక్ జిల్లా నేపథ్యమే. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆయన 2008లోనే తన పదవికి రాజీనామా చేశారు. ఆ తర్వాత ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన నారదాసు లక్ష్మణ్‌రావు ఎమ్మెల్సీగా విజయం సాధించారు. అనంతరం 2019లో అదే జిల్లా నుంచి కాంగ్రెస్ సీనియర్ నేత జీవన్‌రెడ్డి గెలుపొందారు. ఇప్పుడు మళ్లీ ఉమ్మడి కరీంనగర్ జిల్లావాసులే ఆ పదవిని దక్కించుకోవడానికి ఆరాటపడుతున్నారు.

### ఆనాడు 1,96,321 మంది ఓటర్లు

2019లో పట్టభద్రుల ఎన్నిక సమయంలో కరీంనగర్-మెదక్-ఆదిలాబాద్-నిజామాబాద్ శాసనమండలి స్థానం పరిధిలో 1,96,321 మంది ఓటర్లుగా నమోదయ్యారు. ఇందులో 1,35,218 మంది పురుషులు, 61,077 మంది మహిళలు, 26 మంది ఇతరులు ఉన్నారు. ప్రస్తుతం ఆరేళ్ల తర్వాత ఎన్నికలు జరుగుతున్న క్రమంలో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నారు. దాదాపు 3లక్షల వరకు పెరగవచ్చని అంచనా. డిగ్రీ ఆపైన చదివినవారికే ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం ఉంది. గతంలో ఓట్లేసినవారు కూడా మళ్లీ ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవాల్సిందే. ఫారం-18 ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చు. లేదంటే తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లోనూ ఆఫ్‌లైన్ ద్వారా ఫారం-18లో వివరాలు నమోదు చేసి సమర్పించవచ్చు.




## డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, అక్టోబరు 2 : డీఎస్సీ-2024 రాత పరీక్ష ఫలితాలను ప్రభుత్వం సోమవారం ప్రకటించిన విషయం తెలిసిందే. మంగళవారమే వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉన్నా ఎంపికైన అభ్యర్థుల 1:3 జాబితా వెల్లడిలో ఆలస్యమైంది. చివరికి బుధవారం ఉదయం ఎస్జీటీ జాబితా మాత్రమే ప్రకటించగా అభ్యర్థులు సర్టిఫికేట్ వెరిఫికేషన్‌కు వచ్చారు. 5వ తేదీ వరకు ప్రక్రియ కొనసాగనున్నది. సంగారెడ్డి జిల్లా పరిధిలోని సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను సంగారెడ్డిలోని సెయింట్ ఆంథోనీస్ హైస్కూల్‌లో నిర్వహించారు. ప్రతీ 50 మంది అభ్యర్థులకు ఒక కౌంటర్ చొప్పున 30 కౌంటర్లు ఏర్పాటు చేశారు. డీఈవో వెంకటేశ్వర్లు స్వయంగా పర్యవేక్షిస్తూ సూచనలు చేశారు. 778 మంది ఎస్జీటీలకు మొదటి రోజు 251 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ ప్రక్రియలో డీఈవో కార్యాలయ ఏడీ శంకర్, డీసీఈబీ సెక్రటరీ లింబాజీ, నాగభూషణం, రఘు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు. మెదక్ జిల్లాకు సంబంధించిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను డీఈవో రాధాకిషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో నిర్వహించారు. తొలిరోజు 275 మంది సర్టిఫికెట్లను పరిశీలించినట్లు డీఈవో తెలిపారు.

# జయశుభకారిణి.. విజయరూపిణి

- నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రముఖ ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి

సంగారెడ్డి అర్బన్/నారాయణఖేడ్/శివ్వంపేట/చిన్నశంకరంపేట/వెల్దుర్తి, అక్టోబరు 2 : శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం నుంచి అమ్మవార్లు కొలువుదీరనున్నారు. ప్రముఖ ఆలయాల్లో వేడుకలకు సిద్ధం చేశారు. సంగారెడ్డి రాజంపేట రోడ్డులోని శ్రీమహలక్ష్మి ఆలయం, నారాయణఖేడ్ పరిధి మంగల్‌పేటలోని దుర్గాభవానీ, శివ్వంపేట బగలాముఖి, చండీ గ్రామంలోని చండికమాత, చిన్నశంకరంపేటలోని సోమేశ్వరాలయం, మండంలోని కొర్విపల్లి దుర్గామాత, జంగరాయిలో దుర్గమ్మ ఆలయాల్లో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. వెల్దుర్తి మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి, మండల పరిధిలోని మన్నెవారి జలాల్‌పూర్‌లో దుర్గామాత ప్రతిష్ఠాపనకు సిద్ధం చేశారు.

### ఏడుపాయలలో వనదుర్గమ్మ ఉత్సవాలు

పాపన్నపేట : ఏడుపాయల వనదుర్గామాత ఆలయంలోని గోకుల్ షెడ్ హాల్‌లో మండపాన్ని ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం విశేష పూజలతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. తొలిరోజు అమ్మవారికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు పట్టువస్త్రాలను సమర్పించనున్నారు. నేటి నుంచి దసరా వరకు ప్రాతఃకాల సమయంలో మూలవిరాట్ వనదుర్గదేవికి విశేషపూజలను నిర్వహించనున్నారు. తొలి రోజున బాలాత్రిపురసుందరి దేవి - శైలపుత్రీదేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. అక్టోబర్ 8న మంగళవారం బోనాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. భక్తులు రూ.1,116 చెల్లించి గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహించుకోవచ్చని పేర్కొన్నారు. పది రోజుల పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.



చాముండేశ్వరి అమ్మవారు

### నిజరూపంలో దర్శనప్రాప్తి

చిలప్‌చెడ్ : మండలం పరిధి చిట్కుల్ గ్రామ శివారులో మంజీరానది ఒడ్డున ప్రశాంత వాతావరణంలో కొలువైన చాముండేశ్వరి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. నవరాత్రుల్లో నవరూపాల్లో అమ్మవారిని పూజిస్తుంటారు కానీ, ఈ ఇక్కడ ఒకే రూపంలో పూజించడం ఆనవాయితీ. 9 అడుగుల ఎత్తుతో జ్వాలా కిరీటధారిణియై 18 చేతులతో గంభీరమైన నిజరూపంలో అమ్మవారు దర్శనమిస్తారు.

### కేతకీ సంగమేశ్వర ఆలయంలో

ఝరాసంగం: మండల పరిధిలోని కేతకీ సంగమేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. తొలిరోజున అమ్మవారిని మంగళగౌరీదేవిగా అలంకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అయితే, ప్రతీయేటా నాలుగురోజుల ముందే కరపత్రాలను అందజేసేవారని, ఈసారి ఆలయ ఈవో అందుబాటులో ఉండకపోవడంతో కనీస సమాచారం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.



ఏడుపాయల ఆలయంలో ఏర్పాటు చేసిన మండపం



## శతాధిక వృద్ధురాలి మృతి


జగినిబాయి (ఫైల్)

నారాయణఖేడ్, అక్టోబరు 2: ఖేడ్ మండల పరిధిలోని వెంకటాపూర్ తండాకు చెందిన శతాధిక వృద్ధురాలు కర్ర జగినిబాయి మృతి చెందింది. కొన్ని రోజుల నుంచి ఆమె అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం తెల్లవారు జామున కన్నుమూశారని మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపారు. కష్ట సుఖాలు, ఒడిదుడుకులను ఎదుర్కొని కుటుంబాన్ని పోషించి తనదైన శైలిలో స్వేచ్ఛగా బతికిన ఆమెకు తండావాసులు ఘనంగా నివాళులర్పించారు.

# భూనిర్వాసితులకు న్యాయం చేస్తాం

● గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



భూనిర్వాసితులతో మాట్లాడుతున్న తూంకుంట నర్సారెడ్డి

వర్గల్, అక్టోబరు 2 : టీజీఐఐసీలో భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేస్తామని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుట నర్సారెడ్డి అన్నారు. బుధవారం భూనిర్వాసితుల ధర్నా శిబిరానికి ఆయన చేరుకుని మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారులు, నాయకులు రైతులను భయభ్రాంతులకు గురిచేసి అంతంతమాత్రమే పరిహారం చెల్లించి భూములను బలవంతంగా లాక్కున్నార న్నారు. అందించిన పరిహారంలోనూ అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు తమదృష్టికి వచ్చిందన్నారు. ఆందోళన చెందవద్దని ప్రతి కుటుంబానికీ ప్లాట్‌తో పాటు 18 సంవత్సరాలు నిండినవారికీ ప్లాట్ వచ్చేవిధంగా కృషి చేస్తామన్నారు. ఆ ప్లాట్లలో టీజీఐఐసీ ద్వారా మౌలిక వసతులు, పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ గృహం పథకం నిర్మించు కునే అవకాశమిస్తామన్నారు. భూనిర్వాసితుల సమస్యలపై నివేదక తయారు చేయాలని తహసీల్దార్ బాల్‌రాజ్‌కు సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మోహన్, మండల పార్టీ యూత్ అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, నందు, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యం

● జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్



ఖైదీలకు బహుమతులను అందజేస్తున్న డీఐజీ శ్రీనివాస్

కంది, అక్టోబరు 2 : క్షణికావేశంలో చేసిన తప్పులకు జైల్లో కుంగిపోతున్న ఖైదీల్లో మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఎన్నో సంస్కరణలు చేపడుతున్నట్లు జైళ్లశాఖ డీఐజీ డాక్టర్ డి. శ్రీనివాస్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని కంది పరిధిలోని సంగారెడ్డి సెంట్రల్ జైలులో బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయనతోపాటు జిల్లా న్యాయసేవధికార సంస్థ కార్యదర్శి బి.రమేశ్, శిక్షణ కలెక్టర్ మనోజ్ హజరయ్యారు. ఖైదీలకు వివిధ విభాగాల్లో క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు, విధుల్లో ప్రతిభ కనబర్చిన ఖైదీలకు బహుమతులు అందజేశారు. ఖైదీలు నేలపై వేసిన గాంధీ చిత్రపటం ఆకట్టుకున్నది. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ నడిచిన అంహింసా మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ దండా భరత్‌రెడ్డి, జైలర్ సంజీవరెడ్డి, డిప్యూటీ జైలర్లు మహిపాల్ రెడ్డి, గౌతమ్, రాజేంద్ర బాబు, కారాగార సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దేవీనమో.. శైలపుత్రీ నమో

● నేటి నుంచి దేవీశరన్నవరాత్రోత్సవాలు

● జిల్లాలో వెల్లివిరియనున్న ఆధ్యాత్మిక శోభ





దుర్గాదేవి, చేర్యాలలోని చావడి వద్ద ముస్తాబు చేసిన అమ్మవారి మండపం

చేర్యాల, అక్టోబరు 2: అమ్మలగన్నమ్మ... ముగ్గురమ్మల మూలపుటమ్మ.. శక్తిస్వరూపిణి అయిన దుర్గాదేవి నవరాత్రోత్సవాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సకల శుభాలు, విజయాలను చేకూర్చే విజయదశమిని పురస్కరించుకుని అమ్మవారిని రోజుకో అవతారంలో తొమ్మిది రోజులపాటు భక్తులు కొలవనున్నారు. ఏటా ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి శుద్ధ నవమి వరకు నవరాత్రులు నిర్వహించడం ఆనవాయితీ. నారద పాంచరాత్ర గ్రంథంలో నవ అనే శబ్దానికి పరమేశ్వరుడని, రాత్రి శబ్దానికి పరమేశ్వరి అని అర్థాలున్నాయి. ఈ మేరకు పార్వతీపరమేశ్వరుల ఆరాధనమే నవరాత్ర వ్రతం. నవ అనగా నూతనమైనది, కొత్తది అని, రాత్రి అంటే జ్ఞానమూ అని అర్థం. నూతన జ్ఞానాన్ని ప్రసాదించే రోజులే నవరాత్రులుకాగా, వాటిని ప్రసాదించే తల్లియే దుర్గాదేవి. ఆమెనే ఆదిపరాశక్తి, సరస్వతి, లక్ష్మీదేవి. అందుకే మిగతా పండుగల మాదిరిగా కాకుండా దసరా వేడుకల్లో అమ్మవారిని ఒక్కో రోజు ఒక్కో రూపంలో పూజిస్తారు.

**పల్లె, పట్టణం ముస్తాబు..**

నవరాత్రోత్సవాలకు పట్టణాలు, గ్రామాలు ముస్తాబయ్యాయి. పలు చోట్ల అమ్మవారి మండపాలు ఏర్పాటు చేసి విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దుర్గాదేవీ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని భక్తులు నేడు భవానీదీక్షలు చేపట్టనున్నారు. నవరాత్రుల పూర్తి అనంతరం తమ ఇష్ట దేవాలయాల చెంతన మాలవిరమణ చేయనున్నారు.

**తొమ్మిది అవతారాలు...**

దస్ అంటే పది, హరా అనగా పండుగ అని అర్థం. విజయానికి నాంది అయిన విజయదశమిని పురస్కరించుకుని దుర్గాదేవీని ఆరాధిస్తే సకల శుభాలు, విజయప్రాప్తి లభిస్తుందని భక్తుల నమ్మకం. ఇందుకు ఎందరో దేవతలు, రాజులు సాధించిన విజయాలే నిదర్శనమని పెద్దలు చెబుతుంటారు. ఇలాంటి ప్రాశస్త్యం కలిగిన నవరాత్రులలో అందరినీ సమ్మోహితులను చేసేది అమ్మవారి అలంకారాలు. రాక్షస సంహార క్రమంలో ధరించిన రూపాలకు ప్రతిగా రోజుకో అలంకారం చొప్పున పూజలు జరుపుతారు. మధుకైటబాధి రాక్షస సంహారం కోసం ధరించిన రూపాలను నవదుర్గ రూపాలని దేవీ, మార్కండేయ, భవిష్య పురాణాలు చెబుతున్నాయి. దేవీ భాగవతం ప్రకారంగా అమ్మవారిని శైలపుత్రి, బ్రహ్మచారిణీ, చంద్రఘంట, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిద రూపాలలో దర్శనమిస్తోంది. ప్రతీ అవతారానికి ప్రత్యేక ఆధ్యాత్మికత, ఉపాసనా రహస్యాలున్నాయి.

● **శైలపుత్రీ (మొదటిరోజు )** :పార్వతి రాజపుత్రిక. నవదుర్గ అలంకరణలో మొట్టమొదటి అమ్మవారు పార్వతీదేవీ స్వరూపం. అమ్మవారిని పూజించటం వలన స్థిరమైన బుద్ధి, మంచి ఆలోచనలు కలుగుతాయి. ఇష్టమైన రంగు నీలం. నైవేద్యం పొంగలి.

● **బ్రహ్మచారిణీ (రెండవరోజు)** : బ్రహ్మస్వరూపిణీ అవతారంలో అమ్మవారు తెలుపురంగు వస్త్రాలు ధరించి బ్రహ్మమండలమును చేతపట్టుకుని సాక్షాత్తు బ్రహ్మ బుద్ధిలోని దేవతగా ఆరాధింపబడుతుంది. అమ్మవారి ఆరాధనతో సకాల విద్యలు సమకూరుతాయి. పసుపు రంగు. నైవేద్యం పులిహోర.

● **చంద్రఘటాదేవీ (మూడవరోజు )** :ఈ అవతారంలో అమ్మవారు ఘంటానాదంతో రాక్షసులను దగ్గరకు రాకుండా చేస్తుంది. అమ్మవారి ఆరాధనతో రాక్షసబాధలు తొలగుతాయి. లేత ఎరుపు రంగు- నైవేద్యం కొబ్బరి అన్నం.

● **కూష్మాండదేవీ (నాలుగోరోజు )**: కూష్మాండం అనగా గుమ్మడికాయ. సృష్టిలో ప్రతీ ఆకు, మొక్క, చెట్టుల ఆరాధనీయంగా కొలుస్తారు. ఆకాశంరంగు, అల్లం గారెలు ప్రీతికరం.

● **స్కంధమాతదేవి (ఐదవరోజు )**: స్కందమాత అనగా కుమారస్వామి తల్లి. ఆరుశిరస్సుల కుమారస్వామికి శక్తి తల్లిగా అవతరించి సృష్టిలో తనకుమారుడిని ఎవరు ఎదురించలేరని శక్తివంతుడిగా తయారుచేస్తుంది. అందుకే ఆరాధన క్రమంలో కుమారస్వామి ఆరాధన ప్రథమం. కనకాంబ రం - పెరుగన్నం ప్రీతి.

● **కాత్యాయనీ దేవి (ఆరవరోజు)** : పెళ్లికాని అమ్మాయిలు అమ్మవారిని ఆరాధిస్తే శివుడంతటిమంచి భర్త లభిస్తాడని ప్రతీతి. మదురు ఎరుపురంగు - రవ్వకేసరి ప్రీతి.

● **కాళరాత్రిదేవి (ఏడవరోజు )**: కాళరాత్రి దేవి తాంత్రిక ఉపాసకులకు ఇష్టదైవంగా కొలుస్తారు. అమ్మవారికి తెలుపురంగు, కదంబం, అన్నిరకాల కూరలతో కలిపి చేసిన అన్నం అంటే ప్రీతి.

● **మహా గౌరి (ఎనిమిదవరోజు)** : మహిళలు, ముత్తయిదువలు సౌభాగ్యం, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని పూజిస్తారు. ఎర్రటి ఎరుపురంగు, మినపగారెలు ప్రీతి

● **సిద్ధిధాత్రిదేవి (తొమ్మిదోరోజు)**: అమ్మవారి అవతారాలలో చివరిగా సిద్ధిధాత్రిదేవిగా పూజిస్తారు. మనో శ్రేయస్సు కలగాలని వేడుకుంటారు. అమ్మవారి ఆరాధన ద్వారా సకల వరాలు సిద్ధిస్తాయి.

# ఇదేనా? అహింస మార్గం..

● గాంధీ జయంతి రోజున యథేచ్ఛగా మాంసం విక్రయాలు



కూచారంలో మాంసం దుకాణంపై దాడులు చేస్తున్న అధికారులు

తూప్రాన్/ రామచంద్రాపురం/ మనోహరాబాద్, అక్టోబరు 2: గాంధీ జయంతి రోజును బేఖాతరు చేస్తూ తూప్రాన్ పట్టణం, రామచంద్రాపురం పట్టణం, తెల్లాపూర్ మున్సిపాలిటీలలో బుధవారం యథేచ్ఛగా చికెన్, మటన్ విక్రయాలు చేపట్టారు. జీవ హింసా చేయరాదన్న నిబంధనలను తుంగలో తొక్కారు. పెత్తర అమావాస్య కావడంతో జనాలు కూడా ఎగబడి నాన్‌వెజ్‌ను కొనుగోలు చేశారు. మున్సిపల్ సిబ్బంది ఉదయం నుంచే అమ్మకాలు అడ్డుకునే ప్రయత్నాలు చేశారు. ఓ వైపు దాడులు చేస్తున్నప్పటికీ, మరోవైపు అమ్మకాలు చేపట్టారు. ఇక మనోహరాబాద్ మండలం కూచారం ముప్పిరెడ్డిపల్లి గ్రామ పంచాయితీలో మటన్, చికెన్ దుకాణలపై గ్రామా పంచాయితీ అధికారులు, పోలీసులు దాడి చేశారు. రెండు దుకాణాలు రూ.4 వేల చొప్పున జరిమానా విధించారు.

# వదలని వరద ప్రవాహం

● 'సింగూరు'కు ఇన్ ఫ్లో 7,263 క్యూసెక్కులు

పుల్‌కల్, అక్టోబరు 2: సింగూరు ప్రాజెక్టును వరద ప్రవాహం వదలడం లేదు. ఎగువ ప్రాంతంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరదనీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టులోకి సెప్టెంబరు 30న ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో తెరిచిన 11వ నంబరు క్రస్ట్‌గేట్‌ను మూసివేశారు. తాజాగా మంగళవారం రాత్రి భారీ వర్షం కురవడంతో 7,263 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నదని ప్రాజెక్టు డీఈఈ నాగరాజు, జేఈఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఉదయం 6 గంటలకు ఇన్‌ఫ్లో 3,454 క్యూసెక్కులు నమోదవగా, సాయంత్రం 3.50 గంటల కల్లా వరద నీటి ప్రవాహం మరింతగా పెరిగింది. దీంతో 6వ నంబరు క్రస్ట్‌గేట్‌ను రెండు మీటర్లు ఎత్తు ఎత్తి 10,734 క్యూసెక్కులు, రెండు జల విద్యుత్ గేట్ల ద్వారా 2,822 క్యూసెక్కుల వరద నీటిని దిగువ మంజీర రిజర్వాయర్‌కు వదులుతున్నారు. మొత్తంగా 13,556 క్యూసెక్కులు అవుట్ ఫ్లో నమోదయింది.

## 150 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

● తొమ్మిదిమందిపై కేసు

బెజ్జంకి, అక్టోబరు 2 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని మండలంలోని తోటపల్లి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల మేరకు యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం గ్రామానికి చెందిన తొమ్మిది మంది కరీంనగర్ జిల్లాలోని వివిధ మండలాల్లోని గ్రామాల్లో రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ క్రమంలో తోటపల్లి గ్రామ శివారులోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఒక డీసీఎం, ఎనిమిది టాటా ఏసీ వాహనాల్లో సుమారు 150 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా సిద్దిపేట ఏసీపీ మధు ఆధ్వర్యంలో పోలీసులు పట్టుకున్నారు. వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి తొమ్మిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

## చోరీకి గురైన పార్శ్వనాథుడి విగ్రహం లభ్యం

టేక్మాల్, అక్టోబరు 2 : నెల రోజుల క్రితం అపహరణకు గురైన పార్శ్వనాథుడి విగ్రహాన్ని పోలీసులు విజయవాడ-నల్లగొండ హైవే రహదారి పక్కన స్వాధీనం చేసుకుని మంగళవారం రాత్రి అక్కడి నుంచి టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు వివరాల్లోకి వెళ్తే గత నెలలో టేక్మాల్ మండల పరిధిలోని వెల్పుగొండ గ్రామ శివారులోని దేవతలగుట్టపై ఉన్న పురాతన పార్శ్వనాథుడి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు తస్కరించారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చెసుకున్న పోలీసులు ఎట్టకేలకు విగ్రహాన్ని కనిపెట్టి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఎవరు చోరీ చేశారన్నదానిపై పోలీసులను సంప్రదించగా విచారణ కొనసాగుతుందని పూర్తయిన తరువాత వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

## పొలానికి వెళ్లిన వ్యక్తి.. నీటిగుంతలో శవమై



మోహన్ (ఫైల్)

టేక్మాల్, అక్టోబరు 2 : పొలం వద్దకు వెళ్లిన వ్యక్తి శవమై కనిపించిన సంఘటన ఎక్లాస్‌పూర్ గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం టేక్మాల్‌కు చెందిన బాజ మోహన్(29) రైతు. రోజులాగే మంగళవారం మధ్యాహ్నం పొలానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన అతడు రాత్రి అయినా ఇంటికి తిరిగిరాలేదు. పొలం వద్ద, చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. అయితే బుధవారం ఉదయం ఎక్లాస్‌పూర్ గ్రామశివారులో మోహన్ బైకు ఉండడంతో ఆ గ్రామస్థులు అతడి కుటుంబ సభ్యులకు సమాచారం అందిచారు. అక్కడి చేరుకున్న వారు చుట్టుపక్కల వెతకగా రోడ్డు పక్కన ఉన్న నీటి గుంతలో మోహన్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎవరో చంపి గుంతలో పడేసి ఉంటారని కుంటుబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయడంతో పోలీసులు క్లూస్ టీం, జాగీలలను రప్పించి ఆధారాలు సేకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దయానంద్ తెలిపారు.

## వేంకటేశ్వరాలయంలో హుండీ చోరీ

● ర్యాలీగా వెళ్లి పోలీసులకు భక్తుల ఫిర్యాదు

అల్లాదుర్గం, అక్టోబరు 2 : అల్లాదుర్గంలోని వేంకటేశ్వరాలయంలో మంగళవారం రాతిర చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగలు ఆలయంలోకి చొరబడి హుండీని ధ్వంసం చేసి సొమ్మును అపహరించుకుపోయారు. గతంలోనూ ఆలయంలో దొంగతనాలు జరుగడంతో భక్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దొంగలను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ఆలయంలో చోరీ తతంగమంతా సీసీ కెమెరాలో రికార్డు అయ్యింది. అర్ధరాత్రి 12 గంటలకు ఆలయంలోని ప్రవేశించిన దుండగుడు హుండీని ఇనుప రాడ్లతో ధ్వంసం చేసి సొమ్మును ఎత్తికెళ్లినట్లు గుర్తించారు.

## ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నిజాంపేట, అక్టోబరు 2 : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిజాంపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రానికి చెందిన దండు నరేష్(42) కొన్ని రోజుల క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్‌కి వెళ్లగా ఆరోగ్యం సహకరించకపోవడంతో తిరిగి ఇంటికి వచ్చాడు. అప్పటి నుంచి పని దొరకక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన అతడు మంగళవారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభుయలు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి భార్య దండు స్వప్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

**చెట్టుకు ఉరివేసుకుని యువతి..**

శివ్వంపేట, అక్టోబరు 2 : బహిర్భూమికి అని వెళ్లిన యువతి చెట్టుకు శవమై వేలాడుతూ కనిపించింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని దంతాన్‌పల్లి గ్రామానికి చెందిన కుల్ల అంజలి (21) మంగళవారం మధ్యాహ్నం బహిర్భూమికని ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాలేదు. తల్లి చుట్టుపక్కల వెతకగా ఇంటి ఎదుట పల్లె ప్రకృతి వనంలోని చెట్టుకు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. అంజలి ఆత్మహత్యకుగల కారణాలు తెలియరాలేదు. మృతురాలి సోదరుడు ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నమ్మించి నగదు కాజేస్తున్న మోసగాడి అరెస్టు

మెదక్‌అర్బన్, అక్టోబరు 2: ఏటీఎం సెంటర్లల్లో నగదు డిపాజిట్ చేయడానికి వస్తున్న వారిని మోసం చేస్తున్న ఓ వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నాగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మండల పరిధిలోని ముస్లాపూర్ గ్రామానికి చెందిన అరవింద్ ప్లాన్ ప్రకారం మాటువేస్తాడు. ఎవరైనా ఖాతాదారులు డబ్బులను డిపాజిట్ చేసేందుకు రావడాన్ని గమనించి వారితో అతడు మాటకలుపుతాడు. నగదు అవసరం ఉందని, మీకు ఫోన్ పే చేస్తానని డబ్బులు ఇవ్వాలని నమ్మబలుకుతాడు. అనంతరం డబ్బులు పంపినట్లు ఒక ఫేక్ మేసేజ్ చూపిస్తూ నగదుతో అక్కడి నుంచి పరారవుతున్నాడు. దీంతో మోసపోయిన పలువురు ఖాతాదారులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

# దొంగతనం కేసులో దంపతుల అరెస్టు

రామచంద్రాపురం, అక్టోబరు 2 : దొంగతనం కేసులో దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన కొల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రవీందర్ కథనం ప్రకారం లాలాగూడకు చెందిన హరీష్ మార్కెటింగ్ పనిపై గత నెల 25న తెల్లాపూర్‌కు వచ్చాడు. అక్కడే రాఘవేంద్ర టిఫిన్ సెంటర్ వద్ద బైకు ఆపి లోపలికి వెళ్లి భోజనం చేసి వచ్చేసరికి తన పల్సర్ బైకును గుర్తు తెలియని వ్యక్తులు తస్కరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా, మంగళవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన భానుప్రసాద్, కీర్తన దంపతులను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నారు. తన స్నేహితుడు సేలం సాయితో కలిసి వారు పలు ప్రాంతాల్లో మొత్తం 14 బైకులు దొంగలించి కరుణాకర్ అనే వ్యక్తికి విక్రయించినట్లు తెలిపారు. ఇలా వచ్చిన డబ్బుతో జల్సాలు చేసేవారమని చెప్పారు. భానుప్రసాద్ నుంచి 5, కరుణాకర్ నుంచి 4 బైకులను స్వాధీనం చేసుకుని దంపతులతో పాటు కరుణాకర్‌ను బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

## అన్నను చంపిన తమ్ముడు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 2 : కుటుంబంలో జరిగిన చిన్నపాటి గొడవ నేపథ్యంలో తమ్ముడు అన్నను హత్య చేసిన ఘటన సంగారెడ్డి పట్టణంలో చోటుచేసుకుంది. పట్టణ సీఐ భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని నాల్సాబ్‌గడ్డకు చెందిన షాహిద్(43) స్థానికంగా మాంసం వ్యాపారం చేస్తుంటాడు. ఇతనికి భార్య, నలుగురు కుమారులున్నారు. మంగళవారం అర్ధరాత్రి షాహిద్ తన భార్యతో గొడవ పడ్డాడు. ఈ విషయంలో తమ్ముడైన రఫీ(41) జోక్యం చేసుకుని సర్దిచెప్పే ప్రయత్నం చేశాడు. అన్నదమ్ముల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన తమ్ముడు రఫీ అన్న షాహిద్‌పై కత్తితో దాడి చేయగా అక్కడికక్కడే మృత్యువాతపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని హత్య జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని సీఐ తెలిపారు.

## నేటి నుంచి త్రిబుల్‌ఆర్ అవార్డు విచారణ

నర్సాపూర్, అక్టోబరు 2: నేటి నుంచి డివిజన్ పరిధిలోని త్రిబుల్ ఆర్ రోడ్డులో భూములు కోల్పోతున్న రైతులతో అవార్డు విచారణ జరుపుతున్నట్లు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. నర్సాపూర్‌లోని రైతువేదికలో జరిగే ఈ కార్యక్రమానికి రైతులు హాజరై అభిప్రాయాలు, అభ్యంతరాలు తెలుపాలన్నారు. 3న నర్సాపూర్ మండలం మహ్మదాబాద్, జానకంపేట, తిర్మలాపూర్, తుజాల్‌పూర్, పెద్ద చింతకుంట గ్రామాల రైతులకు, 4న మూసాపేట, నాగులపల్లి, చిన్నచింతకుంట, రెడ్డిపల్లి గ్రామాలకు, 5న శివ్వంపేట మండలం ఉసిరికపల్లి, గుండ్లపల్లి, కొత్తపేట, పోతులబోగుడ, లింగోజీగూడ, 7న రత్నాపూర్, కొంతాన్‌పల్లి రైతులు హాజరుకావాలని కోరారు.

### కరెంట్ కాటుకు రైతు బలి

మెదక్ కల్చరల్, అక్టోబరు 2: కరెంటు కాటుకు రైతు బలి అయ్యాడు వివరాల్లోకి వెళ్తే మెదక్ మండలం అవుసులపల్లికి చెందిన బోయిన నర్సింహులు తన వ్యవసాయ భూమి వద్ద బోరు మరమ్మతులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు కరెంట్ షాక్ తగిలి మృతిచెందాడు.

## మహాత్ముడికి ఘన నివాళి



గాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డిలోని గంజిమైదాన్‌లోని గాంధీ విగ్రహానికి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీపాటిల్ నివాళులర్పించారు. -సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 2



మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని మండల పరిధిలోని చిట్కుల్ పంచాయతీ కార్యాలయం వద్ద మహాత్ముడి విగ్రహానికి కాంగ్రెస్ నాయకుడు నీలం మధు ముదిరాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. -పటాన్‌చెరు, అక్టోబరు 2

## ఆలయ నిర్మాణానికి ముస్లిం విరాళం



విరాళం అందజేస్తున్న యూసుఫ్

చిలప్‌చెడ్, అక్టోబరు 2: ముస్లిం యువకుడు హిందూ ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసి మతసామరస్యానికి ప్రతీకగా నిలిచాడు. మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణం చేపడుతున్నారు. ఆ పనులకు హైదరాబాద్‌లోని షాపూర్‌నగర్ పట్టణానికి చెందిన యూసుఫ్, అతని మిత్రులు కలసి బుధవారం రూ.51 వేలను విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా అతడిని పలువురు అభినందించారు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అంజిరెడ్డి, విఠల్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ కుటుంబానికి డిజిటల్ ఫ్యామిలీ కార్డు

● నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం.. 11 బృందాలు ఏర్పాటు

● మెదక్ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్ అర్బన్, అక్టోబరు 2: మెదక్ జిల్లాలోని ప్రతీ కుటుంబానికి డిజిటల్ కార్డు అందజేయనున్నట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆర్డీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపల్ అధికారులకు సర్వే నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాలోని ఎంపిక చేసిన ప్రాంతాల్లో నేటి గురువారం నుంచి ఈనెల 7వ తేదీ వరకు ఎలాంటి లోపాలు లేకుండా ఇంటింటి సర్వే చేపట్టాలన్నారు. ప్రత్యేక సీనియర్ అధికారి ఆధ్వర్యంలో 11 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ముందుగా గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. మెదక్‌కు ప్రత్యేక అధికారిగా దాసరి హరిచందనను ప్రభుత్వం నియమించిందన్నారు. సర్వే నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తిన తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో మెదక్, నర్సాపూర్ ఆర్డీవోలు రమాదేవి, జగదీశ్వర్‌రెడ్డి, ఈడీఎం సందీప్, తహశీల్దార్లు, ఆర్ఐ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# హోంగార్డుకు అండగా ఉంటాం

● ఆసుప్రతి ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది

● సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్



హోంగార్డును పరామర్శిస్తున్న కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 2 : గత నెల 26వ తేదీన కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువులో నిర్మించిన అక్రమ నిర్మాణం కూల్చివేత సమయంలో గాయపడ్డ హోంగార్డు గోపాల్‌కు అన్ని విధాలా అండగా ఉంటామని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా ఎస్పీ రూపేష్‌లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఏఐజి ఆసుపత్రిలో గోపాల్‌ను వారు బుధవారం పరామర్శించారు. గోపాల్‌కు మెరుగైన వైద్య చికిత్సలు అందజేయాలని ఆసుపత్రి వర్గాలకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపాల్ ఆరోగ్యం మెరుగ్గా ఉందన్నారు. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆసుపత్రికి అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందని అన్నారు. వేతనం ఆగకుండా చూస్తామని, ఏవైనా పెండింగ్ బిల్లులు ఉంటే క్లియర్ చేస్తామని తెలిపారు. గోపాల్ ఆరోగ్య విషయమై ఎస్ఐ స్థాయి అధికారి నిత్యం పర్యవేక్షిస్తున్నారని వివరించారు. హోంగార్డుకు పోలీసు శాఖ అన్ని రకాలుగా అండగా వుంటుందని తెలిపారు. ఆసుప్రతి బిల్లులు అన్ని ప్రభుత్వం తరపున చెల్లించడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు.


సంగారెడ్డి గంజిమైదాన్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు


సంగారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ సంజీవరావు


మునిపల్లి: బుసారెడ్డిపల్లిలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామస్థులు


జహీరాబాద్: మున్సిపల్ ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

# బాపూజీ ఆశయసాధనకు కృషి చేయాలి


సదాశివపేట: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ అపర్ణ, వైస్ చైర్మన్ చింతా గోపాల్


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, ఏఎంసీ వైస్ చైర్మన్ కృష్ణ గుప్తా


పటాన్‌చెరులో జాతిపితకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి తదితరులు


మెదక్ కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్నఅదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు


జిల్లా పోలీస్ కార్యాలయంలో గాంధీ జయంతి కార్యక్రమంలో మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

న్యూస్‌నెట్‌వర్క్, అక్టోబరు 2:

**జాతిపిత మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా పార్టీల కార్యాలయాలు, పలు సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహాలు, చిత్రపటాలను పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలుచోట్ల దివంగత మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతిని కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాపూజీ మార్గం అందరికీ అనుసరణీయ మని, అహింసా మార్గంలో ఆయన ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.**

## సంగారెడ్డి జిల్లాలో..

సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గంజిమైదాన్‌లోని గాంధీ విగ్రహానికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అధికారులు చంద్రశేఖర్, పుల్లారు ప్రకాశ్‌లు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. మంజీరా స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో జడ్పీ ప్రాంగణంలోని గాంధీ విగ్రహానికి అధ్యక్షుడు మాణయ్య పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ ఎ. సంజీవరావు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మునిపల్లి తహసీల్దార్ కార్యాలయంతోపాటు పెద్దగోపులారం, బుసారెడ్డిపల్లి, చిన్నచెల్మెడ గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో గల గాంధీ విగ్రహానికి జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి గాంధీ ఆశయసాధన దిశగా కృషిచేద్దామని పిలుపునిచ్చారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి సిబ్బందితోకలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పారిశుధ్య కార్మికులకు ప్రసంసపత్రాలను ఇచ్చి అభినందించారు. అదేవిధంగా మొగుడంపల్లి మండలంలో గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. కొండాపూర్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో మహాత్మాగాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సదాశివపేట మున్సిపల్ మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ శివరాజ్ పాటిల్, వైస్‌చైర్మన్ చింతా గోపాల్, కమిషనర్ జె.ఉమా, కౌన్సిలర్లు ఇంద్రమోహన్‌గౌడ్, చౌదరి ప్రకాష్, విద్యాసాగర్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు చీల మల్లన్న, ఆ పార్టీ రాష్ట్ర నాయకులు శివరాజ్‌పాటిల్ తదితరులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సదాశివపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ గుప్తా, రాష్ట్ర మాజీ బీసీ కార్పోరేషన్ డైరెక్టర్ పట్నం సుభాష్, నాయకులు ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, పండ్లు, బ్రెడ్లు, ఆహారం పంపిణీ చేశారు. కంది మండల పరిధిలోని మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం రుద్రారంలో గాంధీ జయంతిని నిర్వహించారు. గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్ చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.రెజా ఇతర అధికారులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పటాన్‌చెరులోని గాంధీ థీంపార్క్‌ల గాంధీ కాంస్య విగ్రహానికిఎమ్మెల్యే గూడెంమహిపాల్‌రెడ్డి పూలమాలలు వేసి ఘనంగా నివాళుల ర్పించారు. వెంట కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు. రామచంద్రాపురం పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో కార్పొరేటర్లు వి.సింధూఆదర్శరెడ్డి, పుష్ప గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నారాయణఖేడ్ మండలం అబ్బెందలో గాంధీ విగ్రహాన్ని బుధవారం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. ఖేడ్‌లో స్థానిక లయన్స్‌క్లబ్, పట్లోళ్ల కిష్టారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే సంజీవరెడ్డి ప్రారంభించారు. అదేవిధంగా వట్‌పల్లి, పుల్‌కల్, చౌటపల్లి, హత్నూర, జిన్నారం, కంగ్టి, నాగల్‌గిద్ద తదితర మండలాల్లోని గ్రామాల్లో గాంధీజీకి ఘన నివాళులర్పించారు.

## మెదక్ జిల్లాలో...

మహాత్మాగాంధీ ప్రపంచానికి చూపిన శాంతి, అహింస మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ వేంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం గాంధీ జయంతిని పురస్కరించుకొని కలెక్టరేట్‌లో మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రమాదేవి గాంధీ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ తదితరులు వేర్వేరుగా గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి గాంధీజీ సేవలను స్మరించుకున్నారు. అదేవిధంగా పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పద్మా రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న మల్లినాథ సూరి సాహిత్య కళాపీఠం భవనంలో బుధవారం మహాత్మా గాంధీ మరియు లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చేగుంట మండల వనరుల కేంద్రం వద్ద లాల్ బహదూర్ శాస్త్రి జయంతిని మండల ఉపాధ్యాయ సంఘాల అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. నార్సింగి మండలంలోని ఆయా గ్రామాల్లో గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. శివ్వంపేట మండలంలోని గోమారంలో ఎమ్మెల్యే సునితారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి సిబ్బందితో కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా నర్సాపూర్‌లోని గాంధీ విగ్రహం వద్ద మున్సిపల్ చైర్మన్, ఆయా పార్టీల నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో కార్యాలయ ఆవరణలో చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అదేవిధంగా చిన్నశంకరంపేట, పెద్దశంకరంపేట, రేగోడ, టేక్మాల్, అల్లాదుర్గం, నిజాంపేట, మాసాయిపేట, పాపన్నపేట, రామాయంపేట, మనోహరాబాద్, వెల్దుర్తి మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటాల వద్ద ఘనంగా నివాళులర్పించారు.


మెదక్‌లోని రాందాస్ చౌరస్తాలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు


బీఆర్ఎస్ మెదక్ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి


శివ్వంపేట: గోమారంలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాలు

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 2: అర్హులైన జర్నలిస్టులందరికీ ఇంటి స్థలాలను మంజూరు చేయడమే లక్ష్యంగా టీయూడబ్ల్యూజే యూనియన్ పనిచేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి తెలిపారు. సంగారెడ్డిలోని ఐబీలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ మేరకు అర్హులైన జర్నలిస్టులందరూ ఈ నెల 15వ తేదీలోగా తమ దరఖాస్తు ఫారాలను నింపి తమకు అందజేయాలని కోరారు. మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, యూనియర్ రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ సూచనల మేరకు జిల్లాలోని అన్నిప్రాంతాల నుంచి జర్నలిస్టుల వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

## మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా కృషిచేయాలి


మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి సీవీ రాములు

జహీరాబాద్, అక్టోబరు 2: మహిళలు స్వశక్తితో ఎదుగుతూ ఆర్థిక స్వావలంబన దిశగా కృషిచేయాలని విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి, తెలంగాణ లోకాయుక్త సీవీ రాములు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో వికాస్ మహిళాసశక్తీకరణ. నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వికాస్‌సంస్థ కోల్‌ఇండియా సహకారంతో మహిళల కోసం శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. వికాస్‌సంస్థ రూపొందిన పలు కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కోఆర్డినేటర్ సురేందర్‌రెడ్డి, ప్రాజెక్టు సహాయ కో- ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటీ రైతుల ధర్నాకు హరీశ్‌రావు మద్దతు

న్యాల్‌కల్, అక్టోబరు 2: న్యాల్‌కల్ మండలంలోని డప్పూర్ వడ్డీ, మల్గి గ్రామాల శివారులో నెలకొల్పనున్న ఫార్మాసిటీ రైతులు చేపట్టనున్న ధర్నాకు మద్దతుగా డప్పూర్ గ్రామంలో గురువారం మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎమ్మెల్యే చింతప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతికిరణ్‌లు పాల్గొననున్నట్లు ఫార్మాసిటీ రైతు నాయకులు తెలిపారు. ధర్నాలో ఫార్మాసిటీ భూబాధిత రైతులందరు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతునాయకులు తెలిపారు.

## నేడు వాహనాలకు వేలం

సంగారెడ్డి క్రైం, అక్టోబరు 2: సంగారెడ్డిలోని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో పలు కేసుల్లో పట్టుబడిన ఒక ఫోర్ వీలర్, ఒక టు వీలర్‌కు గురువారం ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ నజీర్ తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## బూచనెల్లి మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థినుల ప్రతిభ

జహీరాబాద్, అక్టోబరు 2: మండలంలోని బూచనెల్లి గ్రామశివారులోగల మైనార్టీ ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు ఇటీవల వెలువడిన నీట్‌ఫలితాల్లో ప్రతిభను చాటారు. కళాశాలలో 47మంది విద్యార్థులకుగాను ఏడుగురు సత్తా చాటారని మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ రుబీనాబేగం తెలిపారు. వారందరికీ ప్రభుత్వ కళాశాలలో ఉచితంగా సీట్లు లభించాయన్నారు. ప్రతిభ కనబరిచినవారిలో బి.గాయత్రి, రేబాఫాతిమ, జె.నందిని, తస్నీయతస్నీం, జువేరియవసీం, షేక్‌షహిత్స పాతిమ, ఫాతిమ సానియ, తదితరులున్నారు.



### గండి చెరువు ఎఫ్‌టీఎల్‌లో
## పంటల ముంపును నివారించాలి

జిన్నారం, అక్టోబరు 2: కాజీపల్లి శివారులోని గండి చెరువు ఎఫ్‌టీఎల్‌లో వ్యవసాయ పంటల ముంపును నివారించాలని జేఏసీ సమావేశంలో పేర్కొన్నారు. బుధవారం కాజీపల్లిలో గండి చెరువు నీటి కాలుష్యం, పంటల మునకపై వివిధ పార్టీల నాయకుల జేఏసీ సమావేశాన్ని నిర్వహించారు. చెరువులో నీటిని కిందికి వెళ్లకుండా నిరోధించడంతో పైభాగంలోని వ్యవసాయ పంటల రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య నివారణ, ఎఫ్‌టీఎల్ పంటల ముంపును నివారిచేందుకు చర్యలు చేపట్టాలని సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, జేఏసీ నాయకులు సత్యనారాయణ, నవీన్‌కుమార్, భార్గవ్, రమాకాంత్, రైతులు సమావేశంలో తీర్మానించారు.

## మంత్రి కొండాసురేఖపై బీఆర్ఎస్ ప్రచారం దుర్మార్గం

● డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్, అక్టోబరు 2: రాష్ట్రంలో మంత్రిగా ఉన్న ఓ మహిళ పట్ల బీఆర్ఎస్ సోషల్‌మీడియా ఇష్టానుసారంగా అసభ్యకర ప్రచారం చేయడం అత్యంత దుర్మార్గమని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ ఖండించారు. బుధవారం ఆయన నర్సాపూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఈ మధ్య దుబ్బాకలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండాసురేఖ పాల్గొనగా ఆ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు మంత్రికి మర్యాదపూర్వకంగా కండువా కప్పితే దానిని బీఆర్ఎస్ పెద్దల సూచనతో సోషల్‌మీడియా నిర్వాహకులు అడ్డగోలుగా ప్రచారం చేయడం అత్యంత బాధాకరమన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో కోల్పోయామన్న బాధతో కాంగ్రెస్ పార్టీ మహిళా నేతలపై అడ్డగోలుగా ప్రచారాలు చేస్తు లబ్ధిపొందాలని చూస్తున్నారని, ప్రజలే వారికి తగిన బుద్ధిచెబుతారన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, మాజీ ఎంపీపీ లలిత, పట్టణ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులుగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు మల్లేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## రైతుల కోసమే ఉపాధి పనులు

రేగోడు అక్టోబరు 2: రైతుల అవసరమేరకే ఉపాధి పనులను చేపడుతున్నట్లు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తెలిపారు. బుధవారం మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. రైతులకు మామిడి, జామ, మునగ తదితర మొక్కలు పెంచుకోవడానికి ఉపాధి హామీ కింద దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పండ్ల మొక్కలు, ఫార్మేషన్ రోడ్లు రైతుల తీర్మానం మేరకే చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుదర్శన్, సత్యనారాయణ, సాయిలు పాల్గొన్నారు.

## రేగోడులో వాహన తనిఖీలు


పోచారం ప్రధాన రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రేగోడు అక్టోబరు 2: మండలంలోని పోచారం ప్రధాన రహదారిపై బుధవారం వాహన తనిఖీలు నిర్వహించినట్టు ఎస్ఐ పోచయ్య తెలిపారు. జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకే తనిఖీలు నిర్వహించామన్నారు.

## మాద్వార్‌లో భోగ్ భండార్

నారాయణఖేడ్, అక్టోబరు 2: మండల పరిధిలోని మాద్వార్ తండాలో బుధవారం భవానీమాత, సంత్ సేవాలాల్ మహరాజ్‌కు భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. భవానీ మాత దీక్షాదారులైన బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్ పాల్గొని మాట్లాడుతూ సేవాలాల్ మహారాజ్ బాటలో ప్రతి ఒక్కరూ నడవాలని కోరారు. పూజారి రాములుతో పాటు సంఘం బాధ్యులైన దీక్షదారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభలతోనే సమస్యలు పరిష్కారం


మునిపల్లి: పెద్దగోపులారంలో గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు


హత్నూర: లింగాపూర్‌లో స్వచ్ఛ గ్రామాల సాధనపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో శంకర్

మునిపల్లి, అక్టోబరు 2: గ్రామసభలతోనే గ్రామాల్లోని సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీడీవో డాక్టర్ హరినందన్‌రావు పేర్కొన్నారు. గాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రమైన మునిపల్లితో పాటు పోల్కంపల్లి, బుదేరా, కంకోల్, పెద్దగోపులారం తదితర గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంగద్ కుమార్, మాజీ ఎంపీటీసీలు పాండు, మనోహర్, పంచాయతీ కార్యదర్శి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పెద్దగోపులారం గ్రామంలో మాజీ ఎంపీటీసీ పాండు ఆధ్వర్యంలో గ్రామస్థులు శ్రమదానం చేసి పిచ్చిమొక్కలను తొలగించారు.

● హత్నూర: మండలంలోని అన్ని గ్రామాలలో ఎప్పటికప్పుడు పారిశుధ్య కార్యక్రమాలు చేపడుతూ స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో శంకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సభలో పాల్గొని ఆయన మాట్లాడారు. స్వచ్ఛ గ్రామాల కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మణిదీప్, మల్లేశం, సందీప్ పాల్గొన్నారు.

● వట్‌పల్లి: గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరారు. వట్‌పల్లి మండలంలోని ఆయా గ్రామాలలో అధికారులు గ్రామసభలను నిర్వహించారు. మండలంలోని దుద్యాలలో నిర్వహించిన సభ ప్రత్యేక అధికారి శాంబిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పారిశుధ్య సమస్యలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేయాలి


చేగుంట పాలిటెక్నిక్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా

చేగుంట ,అక్టోబరు 2 : చేగుంట పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ అధ్వర్యంలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేత కార్యక్రమం చేపట్టారు. సేకరించిన చెత్తను పంచాయతీ కార్మికులతో డంపుయార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చక్రవర్తి మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల అనేక అనర్థాలు కలుగుతాయని అవగాహన కల్పించారు. స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లను ఆయన అభినందించారు. అనంతరం వలంటీర్లకు పాలిటెక్నిక్ కళాశాల తరఫున ప్రిన్సిపాల్ చక్రవర్తి బహుమతులు ప్రదానం చేశారు.

● చిన్నశంకరంపేట: స్వచ్ఛత అందరి బాధ్యతని కావేరి స్టీల్ పరిశ్రమ మేనేజర్ రంగు పరమేశ్వర్ అన్నారు. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని ఖాజాపూర్ గ్రామ శివారు కావేరి స్టీల్ పరిశ్రమ ఆధ్వర్యంలో పటేల్ చెరువు వద్ద పరిశ్రమ సిబ్బంది స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు.చెరువు వద్ద పిచ్చి మొక్కలు, చెత్తా చెదారాన్ని తొలగించారు. కార్యక్రమంలో పరిశ్రమ హెచ్ఆర్ మంజూ, సిబ్బంది సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికులకు అవార్డులు


నారాయణఖేడ్: ప్రశంసాపత్రాలు అందుకున్న పారిశుధ్య కార్మికులు

నారాయణఖేడ్, అక్టోబరు 2: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాల్లో బాధ్యతతో స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహించిన స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ జగ్జీవన్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్, మున్సిపల్ వైస్ చైర్మన్ దారం శంకర్ లు శాలువాలతో సన్మానించి అవార్డులు, ప్రశంసా పత్రాలను బహుకరించారు. స్వచ్ఛ దివస్‌లో భాగంగా కోర్టు కాలనీలో మాస్ క్లీనింగ్ పేరిట శుభ్రత పనులు చేపట్టి మొక్కలు నాటారు. పారిశుధ్య విభాగం పర్యవేక్షకుడు శ్రీనివాస్, కౌన్సిలర్లు వివేకానంద్, మాజీద్, రాజేష్ చౌహాన్ పాల్గొన్నారు.

● జిన్నారం: గాంధీ జయంతి సందర్భంగా బొల్లారం మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులకు చైర్ పర్సన్ రోజారాణి సన్మానించారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులను సన్మానించి, పట్టణంలో వారు అందిస్తున్న సేవలను ప్రశంసించారు.

## రేపు వట్‌పల్లిలో ఉచిత వైద్య శిబిరం

సంగారెడ్డి అర్బన్, అక్టోబరు 2: సంగారెడ్డిలోని సహారా ఇన్‌క్లూజీవ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 4న వట్‌పల్లిలోని వెంకటఖ్వాజా దర్గా ఫంక్షన్ హాల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించున్నట్లు ఆస్పత్రి ఎండీ మఠం శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్పత్రి న్యూరో ఫిజీషియన్ డా.ధీమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కన్సల్టేషన్ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. న్యూరాలజీ సేవలు, కీళ్ల నొప్పులు, మెకాలి బలహీనత, తలనొప్పి, పక్షవాతంతో పాటు అంగ వైకల్యం కలిగిన పిల్లలకు ఉచితంగా వైద్య సేవలందించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా స్త్రీ వైద్య నిపుణులు డా.శ్రేయాదేశాయ్ చేత పీసీవోడీ, సంతానం లేమి సమస్యలు, ఇతర ప్రసూతి సమస్యలకు వైద్య సేవలందించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 9949079792, 9515579 79 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

## జాతీయ స్థాయి పోటీలో రాణించాలి


సాఫ్ట్‌బాల్ శిక్షణ పొందుతున్న విద్యార్థులతో అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి

నర్సాపూర్, అక్టోబరు 2: త్వరలో జరగనున్న 42వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో విజయం సాధించే విధంగా క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు సూచించారు. బుధవారం నర్సాపూర్ గిరిజన గురుకులంలో సాఫ్ట్‌బాల్ అకాడమీలో జరుగుతున్న తెలంగాణ బాలుర శిక్షణ శిబిరాన్ని అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు సందర్శించి శిక్షణ పొందుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్నవారికి పలు సూచనలు కూడా చేశారు. కార్యక్రమంలో జాతీయ స్థాయి క్రీడాకారుడు అభిషేక్‌గౌడ్, ప్రసన్న, అసోసి యేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.